# తరలి వెళ్లాము

"బాబూ, బాబూ. లెగనండి - మన మెల్లేసరికి తెల్లారిపోతది" అని పిలుస్తున్నారెవరో. మగతగావున్న నాకు చటుక్కున మెలుకువ వచ్చింది. మేము పక్కలు వేసుకున్న అరుగుకి యివతల పందిట్లో పడు కున్నవాళ్లు ఒకరిద్దరు కదిలారు. పడక్కుర్చీలోంచి ఎవరో లేచారు. శంకరమే! అతనులేచి, వళ్లు విరుచుకున్నాడు బద్ధకంగా. పక్కనుంచి సన్నగా పడుతున్న దీపం వెల్తురులో, అతని ఆకారం అస్పష్టంగా కను పించింది. అలిసిపోయినట్లుగా విదిలించాడు చేతులు. నా మనస్సు ఎవరో గుప్పిట పట్టినట్లు, ఏదో బాధ కలిగింది.

అంతాలేచారు. మరోగంటకి బయలుదేరాము, రెండు బళ్లలో, సుమిత్రవాళ్ల తాతగారి వూళ్ళో, ఆ పల్లెటూళ్ళో చేస్తున్నారు పెళ్లి. సుమిత్ర ఉత్తరం, ఆపైన శంకరం వ్రాసిన నాలుగు వాక్యాల ఉత్తరం నన్ను రప్పించాయి యీ పెళ్లికి. రగ్గు దగ్గరకు లాక్కొని బయటకు చూశాను నేను. మా ముందు నడిచే బండిలో ముగ్గు రున్నారు. శంకరం ఉన్నాడు ఆ బండిలో.

లేత బూడిదరంగుగా వున్నదేమిటి యీ వెన్నెల? నా తల్లోని మల్లెపూలు, నా ప్రక్కనున్న బుట్టలోని విచ్చినపూలు గుండెలలో ఏమిటో కలవరింతలు కలిగిస్తున్నాయి. కలవరింతగా కాకి అరుస్తోంది ఎక్కడో. పంటలు లేని నేల మైదానంలాగా పఱచుకుని వున్నది. దారి పక్కన ఆకులు లేని చెట్లు, అస్పష్టమైన ఆకారాల్లో, గీతల్లాంటి కొమ్మలతో కనుపిస్తున్నాయి. నేను బాధగా కళ్ళు మూసుకున్నాను.

నాలుగేళ్ల క్రితం - యీ వెన్నెల ఎంత మెరుస్తోంది! మిలమిల లాడుతూ లోకమంతా శోభతో నింపివేసిన వెన్నెల అది. జలతారు పట్టులోంచి, జరీపోగుల్లోంచి చూస్తున్నట్లు కనుపించాయి ఆ బాట, ఆ మైదానం, ఆ కాలువ ఆ రాత్రి నాకు. వెన్నెల రాత్రంతా యింకా ముందే ఉన్నదప్పుడు. వెండిలాగ మెరుస్తోంది వెన్నెల. చెట్లు మౌనంగా, చల్లగా కనుపిస్తున్నాయి.

ఆనాడు ముందు బండిలోంచి శంకరం పాటలు వినిపిస్తున్నాయి. నా కళ్లు మూతలు పడసాగాయి. ఎడ్లు నడుస్తోంటే వాటి గిట్టలచప్పుడు, బండిచక్రం గరగరమని ఎండిన రేగటి గడ్డలమీద నడచిన చప్పుడు, వీటిని మించి ఎడ్ల మెడ పట్టీలలోని పెద్ద మువ్వల చప్పుళ్లు - ప్రశాంత మైన వెన్నెలలో, చలి చలిగా తియ్యగా వున్న వెన్నెలలో, ప్రశాంతతలో కలిసిపోయినాయి యీ శబ్దాలన్నీ. వీటిలోంచే శంకరం గొంతు వినిపించింది.

అంతకు మునుపు నెలరోజుల క్రితం ఎందుకు చెప్పాడు నాకు అవన్నీ? నిజంగా నా సలహా కావలిసేనా? కాలేజీ విడిచాక స్నేహితులు కొరవడ్డ అతనికి అన్నీ చెప్పుకోవడానికి నేను దొరికానేమో! లేక తన మనస్సులో సుశీలను చేసుకోవాలని ఉన్నప్పటికీ, మరొకళ్లు కూడా చెబితే బాగుంటుందనుకున్నాడేమో! ఏమో! ఎడ్ల మెడల లోని గంటలు "ఔను, ఔను" అన్నట్లు మ్రోగినట్లనిపించాయి.

ఆనాడు - శంకరం కంఠం టెలిఫోనులో నన్ను పలుకరించింది. "మధ్యాహ్నం వచ్చాను వూళ్ళోకి. ఇంటర్వ్యూ వుంది రేపు" అని చెప్పాడు. హాస్టలుకి రమ్మన్నాను అతన్ని.

"ఈ వేళ రాను. ఎంతైనా పరీక్షకదా! రేపు సాయంత్రం వస్తా. బయటికి ఎక్కడికైనా వెడదాం. పర్మిషను తీసుకో" అన్నాడు.

సరేనని నేను ఫోను పెట్టేశాను. చిన్నప్పుడు ఏమంత చనువు లేకపోయినా శంకరం బెనారస్ నుంచి తిరిగి వచ్చాక, బాగా పరిచయం ఏర్పడింది నాకు. క్రిందటి వేసవి సెలవుల్లో నేను మా వూరు వెళ్ళడం, దోవలో శంకరం వాళ్ళింట్లో అనుకోకుండా పది, పదిహేను రోజులుండటం జరిగింది. ఆ రోజుల్లోనే మా బంధుత్వం స్నేహంగా మారింది.

"ఏమైంది పరీక్ష?" అనడిగాను చిరునవ్వుతో మర్నాడు సాయంత్రం.

"జరిగిపోయింది - పోదామా బయటికి? ఈ కోటగోడల మధ్య నాకు తోచదు" అన్నాడతను.

మరో పావుగంటకి, సముద్రం దగ్గరవున్నాము. ఇసుకలో మెల్లిగా అడుగులు వేస్తున్నాడతను. కొంచెం ఆగి జేబులోంచి రుమాలు తీసి, కళ్ళజోడు తుడిచి పెట్టుకున్నాడు. రుమాలు మెడకి చుట్టుకుంటూ నా వేపు చూశాడు.

"కూర్చుందామా, అల్లా నడుద్దామా?" అన్నాడు.

"నీ యిష్టం" అన్నాను నేను. అతనక్కడే కూర్చున్నాడు. ఎగిరి పోతున్న బెలూన్లు పట్టుకోవడానికి పరుగెత్తుతున్నారు పిల్లలు.

"నీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలనుకున్నాను" అన్నాడతను. అతని కంఠం సీరియస్‌గా వినిపించింది. ఎందుకని

క్రొత్తగా వుంది అంతా నాకు? నిన్న అతని కంఠం ఫోన్‌లో వినపడి నప్పట్నించీ క్రొత్తగానే వుంది.

"చెప్పు" అన్నాను. అతను వెంటనే ఏమీ అనలేదు. కొంచెం ఆగి, "నీకు తెలుసేమో కదూ! అమ్మా, నాన్న నన్నో యింటివాణ్ణి చేయాలని తాపత్రయపడుతున్నారని." నేను తలూపాను. తలవంచి ఇసుకలో చూపుడు వ్రేలితో గీతలు గీయసాగాను. మళ్లీ మౌనం వహించాడతను. నాతో మాట్లాడవలసిందేమిటి అన్న ప్రశ్న నా లోపలే ఆడుతోంది. జవాబు వినాలంటే భయం భయంగా వుంది.

"మీ సుశీల విషయంలో నీ అభిప్రాయ మేమిటి?" అన్నా డతను. ఒడ్డువరకు వచ్చి విరిగిన కెరటంలా ఫీలయ్యాను ఒక్క క్షణం పాటు. ఆ తరువాత ఉరుకులతో, పరుగులతో పఱచుకుంటున్న నీటి లాగా నా ఆలోచనలు సాగాయి.

"సరిగ్గా వారం క్రిందట మీ మామయ్యే యీ ప్రసక్తి తీసుకు వచ్చారు. సుశీల చాలా అమాయకురాలని అంతా అనుకుంటుంటే విన్నాను – నాలాంటి గడుసువాడితో వేగగలదా అని నా సందేహం." అతను తేలిగ్గా నవ్వాడు యీ మాట అని. నేను కూడా తప్పనిసరిగా నవ్వాను.

"మరేమీ ఫరవాలేదులే. ఈడూజోడూ సరిపోతుందిలే." అన్నాను నేను.

చీకటి పడేవరకు అక్కడే వున్నాము. అతను ఎన్నో సంగతులు చెప్పాడు – తన మనస్సు ఎన్ని విధాల, ఎన్ని వేపుల క్రమ్ముకుంటున్నదీ

చెప్పాడు. అన్నిటికీ "ఊఁ" అనో, "ఆఁ" అనో సమాధానాలిచ్చాను నేను. ఆనాటి సంగతి అది.

అప్పుడు సుశీలకి, శంకరానికి పెళ్లి అయిన ఆనాడు అంతా తరలి వెళ్లాము. నేనూ వెళ్లాను. శంకరం ఒక యింటివాడైనాడు.

—కలలా గడిచిపోయిన నాలుగు సంవత్సరాల తర్వాత, ఎన్నో మార్పులు జరిగిన తర్వాత - ఒకనాడు సుమిత్ర కంఠం వినిపించింది ఫోన్‌లో. "సాయంత్రం మా యింటికి వస్తావా? పిక్చర్‌కి వెడదాం." అని ప్రపోజులు. సరేనన్నాడు.

సినిమాహాలులో కూర్చున్న పదినిముషాలకి నా వేపు తిరిగిందామె. "నీతో ముఖ్యమైన సంగతి మాట్లాడాలని యిలా ప్రోగ్రాం పెట్టాను." అన్నది.

"సినిమాలోనా."

"ఔను. ఈ చీకట్లో అయితే ఫ్రీగా మాట్లాడగలను నేను." అన్నదామె.

న్యూసరీలు మొదలైంది. నా చేతిని ఆమె వ్రేళ్ళు గట్టిగా అదిమాయి. "సుశీలవాళ్ళ వదిన, అన్నయ్య వచ్చారు మా యింటికి. సుశీల పోయాక పిల్లవాడు వాళ్లదగ్గరే వున్నాడు."... ఆమె హఠాత్తుగా తెచ్చిన యీ ప్రసక్తి క్రొత్తగా వుంది. అయితే ఆమె ప్రస్తావించబోయేది కూడా చీకట్లో మిణుగురులా స్ఫురించింది నాకు. చాలసేపువరకు ఎవరం మాట్లాడలేదు. తెరమీద అంతా ఏదో గొడవగా వుంది నాకు. శంకరం ఎవరు, నేనెవరో! ఐతే నేనెందుకు వున్నాను యీ ప్రసక్తిలో?

"వాళ్ల వదిన అడిగింది నన్ను...అతని విషయం. సుశీల పోయి ఏడాది తిరక్కుండా యీ మాట లేమిటన్నాను నేను." ఆగింది సుమిత్ర. తలవంచి కళ్ల మీద చేతులుంచుకుంది ఆమె.

"కానీ ... కొంచెం ఆలోచిస్తే, యిప్పుడే విపరీతంగా వంటరి తనం అనిపిస్తుందేమో అతనికి. ఎంత బాధ నిజంగా! అతన్ని గురించి నీ అభిప్రాయం ఏమిటి ?" అన్నది.

నేను వెంటనే జవాబివ్వలేదు. "నీకు కూడా పరిచయమేనా అతను ? నేనేం చెప్పగలను." అన్నాను.

"అల్లాకాదు. నాకున్నది ముఖ పరిచయమే. నీకు బంధుత్వం, స్నేహం కూడా వున్నాయి. నామనస్సుని నువ్వే సమాధానపఱచ గలవు." ఆమె కంఠం వణికింది.

"మంచివాడు సుమిత్రా అతను. అతనికి ప్రేమించే శక్తివుంది." అన్నాను నేను. నేను అనవలసినది అదే కనుక అన్నాను.

—పర్యవసానంగా యిప్పుడు - మరోసారి శంకరం, సుమిత్ర పెళ్లికి తరలి వెడుతున్నాము. వెన్నెలంతా ముందేవున్న మెరిసే రాత్రి కాదిది. మెరుపు పోయి, దిగులుగా, లేచీకటిలో తడిసిన, తెల్ల వారుఝామున కాసే వెన్నెలిది.

...నేను కళ్ళు మూసుకున్నాను. నా వెనుకనుంచి సన్నని చప్పుడు, కొండల మధ్య, చెట్లమధ్య, జలజలమని ప్రవహిస్తున్న సెల యేరు చేసే చప్పుడు వినిపిస్తోంది. ఆ సెలయేరు నా వెనుకనుంచి వచ్చి, నా ప్రక్కగా నన్ను ఒరుసుకుంటూ, నామీద తుప్పర్లు జల్లి అహో

వెళ్ళిపోయింది. నా ప్రక్కనుంచి, నా ప్రక్కనుంచే మరో సన్నని కాలువ మంద మందంగా ప్రవహిస్తూ ముందుకుపోతూ, ఎక్కడో దూరంగా, నా చూపుకి అందని దూరంలో, ఆ సెలయేటిలో కలిసి పోతోంది.

నేను - నేను యిక్కడే, యీ గ్రుడ్డి వెన్నెలలో వంటరిగా వున్నాను.

———